సాక్షి
నిర్మల్
మంగళవారం । 25 । మార్చి । 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ: 6:24	బుధ : 4:59

న్యూస్‌రీల్

క్షయ రహిత జిల్లాకు కృషి
- డీఎంహెచ్‌వో రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌ను క్షయ రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలనీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రపంచ క్షయ దినోత్సవం సోమవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చాలన్నారు. ముఖ్యంగా అధిక ప్రమాదం ఉన్న ప్రజలను గుర్తించి వారందరికీ పరీక్షలు నిర్వహించాలన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్ల న్నే కేసులో గుర్తింపు సులభతరం అవుతుందన్నారు. సమావేశంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ నైనారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల వేళ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

లక్ష్మణచాంద: పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని ఎంజేపీ గురుకులాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో గోపీచంద్ పేర్కొన్నారు. మండలంలోని రాచాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇది వరకే పూర్తయిన పరీక్షలు ఎలా రాశారో అడిగి తెలుసుకున్నారు. రానున్న గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు చాలా కీలకమన్నారు. సంబంధిత సబ్జెక్టు టీచర్స్ స్టడీ అవర్స్‌లో సబ్జెక్టులపై, మోడల్ క్వశ్చన్ పేపర్‌పై, పార్ట్ బి పేపర్‌పై అవగాహన కల్పిస్తూ పిల్లలు శ్రద్ధగా చదివేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు సాయంత్రం, నైట్ స్టడీ అవర్స్‌లో టీ, స్నాక్స్ అందించాలని సూచించారు. కష్టపడి చదివితే మంచి ఫలితం వస్తుందని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు అశోక్, నాగరాజు, వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ



ఉప్పు రవీందర్

భైంసారూరల్: యోగా ఆన్‌లైన్ పరీక్షలో మండలంలోని ఇలేగాం వాసి ఉప్పు రవీందర్ ప్రతిభ కనబరిచినట్లు తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జీ సెక్రెటరీ సిద్దారెడ్డి సోమవారం తెలిపారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి యోగా రిఫరీ డిప్లొమా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించింది. 130 మంది ఈ ఆన్‌లైన్ పరీక్షలు రాయగా ఉప్పు రవీందర్ ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన ఉప్పు రవీందర్‌కు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ ఆన్‌లైన్‌లో ప్రశంసాపత్రం అందించారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన డీఎం



కలెక్టర్, ఎస్పీతో ఆర్టీసీ డీఎం పండరి

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్: ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.పండరి కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహాలక్ష్మి పథకం అమలుతీరు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో ప్రయాణికులకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. తర్వాత పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిలను కలిశారు.

'పది'లో విద్యార్థి డిబార్
- సీఎస్‌కు నోటీసు

నిర్మల్‌రూరల్: జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం మూడో పరీక్ష ఇంగ్లిష్ జరిగింది. భైంసాలోని బాలికల ఉన్నత పాఠశాలలో కాపీయింగ్ పాల్పడుతున్న ఓ విద్యార్థినిని రాష్ట్ర పరిశీలకుడు టి.శ్రీనివాస్ డిబార్ చేశారు. లోకేశ్వరం మండలకేంద్రంలోని ఉన్నతపాఠశాల చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్)నర్సింహులచార్యులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు డీఈవో రామారావు మెమో జారీ చేశారు. ఉపాధ్యాయులకు విధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యంపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఏదీ పారిశ్రామిక ప్రగతి

- జిల్లాలో పరిశ్రమలకు గ్రహణం
- ఇథనాల్.. క్యాన్సిల్!?
- ఆయిల్‌పామ్ అనుమానమే..
- అడ్రస్‌లేని ఇండస్ట్రియల్ కారిడార్..
- అభ్యంతరాలు తెలుసుకోకుండా పనులు
- ఆదిలోనే తప్పని అడ్డంకులు



జిల్లా ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తోంది. ఇప్పటికీ జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి బాటలు పడలేదు. మంజూరైన పరిశ్రమలకు పట్టిన గ్రహణం వీడటం లేదు. పాలకుల లోపమా, అధికారుల పనితనమా, ప్రశ్నించలేని ప్రజల అమాయకత్వమా.. అర్థం కావడం లేదు. విషయం ఏదైనా ఇప్పటికీ ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో ఏర్పాటు ప్రారంభం కాలేదు. ఇథనాల్ పరిశ్రమ ఆదిలోనే ఆగిపోయింది. ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుపై అనుమానాలు ఉన్నాయి. ఇక ఏళ్లుగా ఊరిస్తున్న 44వ జాతీయ రహదారి వెంట ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు ప్రతిపాదన అడుగు కూడా ముందుకు పడలేదు. బాసరలో ఏర్పాటు చేస్తామన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లూ జాడలేవు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే జిల్లాకు పరిశ్రమలు వస్తాయన్న ఆశ ఏ కోశానా లేదు. – నిర్మల్

ఇథనాల్ కథేంటి..!?

జిల్లాలో తొలి ప్రధాన పరిశ్రమగా వచ్చిన ఇథనాల్‌కు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. తీవ్ర ప్రజావ్యతిరేకతతో అగమ్యగోచరంగా మారింది. దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య పీఎంకే సంస్థ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు పనులు మొదలుపెట్టింది. ఈ ఫ్యాక్టరీ వల్ల భవిష్యత్తులో తమపై కాలుష్య ప్రభావం ఉంటుందంటూ స్థానిక గ్రామాలు అడ్డుచెప్పాయి. పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వాహకులు, అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేయడంతో గత నవంబర్‌లో ఒక్కసారి ఆ గ్రామాల ఆందోళన భగ్గుమంది. ఊళ్లకు ఊళ్లు కదిలివచ్చి రోజులపాటు రహదారులు దిగ్బంధం చేశాయి. రాష్ట్రప్రభుత్వం సైతం ప్రజాందోళనకే మద్దతు తెలుపుతూ ఫ్యాక్టరీ పనులను నిలిపివేస్తామని ప్రకటించింది. దీంతో ఇథనాల్ పరిశ్రమ కథ అక్కడితో ఆగిపోయింది.

ఆయిల్‌పామ్.. ఏమవుతుందో..!

జిల్లాలో ఇథనాల్ తర్వాత వచ్చిన మరో పరిశ్రమ ఆయిల్‌పామ్. సోన్ మండలం పాక్‌పట్ల(పాత పోచంపాడ్) సమీపంలో ఎస్సారెస్పీ ప్రాజెక్టు దిగువన ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం స్థలం కేటాయించారు. ప్రియూనిక్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయాల్సిన ఈ పరిశ్రమకు 2023 అక్టోబర్ 4న అప్పటి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఎస్సారెస్పీ దిగువన బఫర్ జోన్‌లో ఉన్న ఈ పరిశ్రమ స్థలంపై అభ్యంతరాలు ఉన్నాయి. పలు శాఖల నుంచి క్లియరెన్స్ లేకపోవడంతో ముందుకు సాగడం లేదు. ఇటీవల ఈ పరిశ్రమ వ్యవహారం రాజకీయరంగు పులుముకుంది. ఆయిల్‌పామ్ ఆగిపోవడానికి మీరంటే మీరే కారకులు అంటూ కాంగ్రెస్–బీజేపీ నేతలు ఆరోపణలు చేసుకుంటున్నారు.

పంటలను సెట్ చేయాలి..

ఏ ప్రాంతం అభివృద్ధి జరగాలన్నా కేవలం పరిశ్రమలు ఉంటేనే సరిపోదు. వాటికి అనుగుణంగా ఎప్పటికీ సరిపడా ముడిపదార్థాలు కావాలి. ఫ్యాక్టరీ పెట్టేముందు దానికి సంబంధించి ఈ ప్రాంతంలో పంటల సాగు సరళి, అలాగే స్థానిక రైతాంగం అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాలన్న విషయమూ చర్చకు వచ్చింది. పరిశ్రమలను పెట్టాలన్న ఆలోచన చేసే ముందే స్థానికంగా పంటసాగు సరళిని సెట్ చేయాల్సిన అవసరం ఉంది.

ముందుచూపు ఉండాలి..

జిల్లా ఏర్పడిన తర్వాత వచ్చిన తొలి పరిశ్రమతోనే చేదు అనుభవం ఎదురైంది. ఇథనాల్ ఫ్యాక్టరీ తమకు వద్దంటూ ఊళ్లు ఎదురుతిరిగాయి. సర్కారు సైతం ఆ గ్రామాలకే వత్తాసు పలికింది. ఇలాంటి సందర్భంలో.. మరి జిల్లాకు ఏం కావాలి..!? ఎలాంటి పరిశ్రలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది..!? అసలు పరిశ్రమలను ఏర్పాటు చేసేముందు జిల్లాలో ఉన్న వనరులు, పంటల సరళిపై పరిశోధనలు చేస్తున్నారా..!? అన్న ప్రశ్నలకు ఎలాంటి జవాబులు లేవు. ఆయిల్‌పామ్‌కు స్థలమే అడ్డంకిగా మారుతోంది. ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ పారిశ్రామికాభివృద్ధిపై యోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనల్లోనే కారిడార్

హైదరాబాద్–నాగ్‌పూర్ 44 జాతీయ రహదారి వెంట ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా చెబుతూనే ఉన్నారు. కానీ ఇప్పటికీ అలాంటి ప్రతిపాదనకు అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రతీసారి బడ్జెట్‌లో పారిశ్రామిక ప్రగతిలో భాగంగా ఈ కారిడార్‌ను అభివృద్ధి చేస్తామంటూ చెప్పడమే మినహా ఎలాంటి ప్రయోజనం లేదు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు వరకే ఎన్‌హెచ్.44 వెంట పరిశ్రమల ఏర్పాటు ఆగిపోయింది. గతంలో బాసరలో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేస్తామన్న ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతిపాదనలూ బుట్టదాఖలయ్యాయి.

రైతుల ప్రయోజనాలే ముఖ్యం..



పరిశ్రమల ఏర్పాటు అవసరమా.. అన్న ప్రశ్న ముందుగా రావాలి. అవసరం అనుకుంటే స్థానిక వనరులను, పంటల సరళిని ముందుగా అంచనా వేయాలి. స్థానిక రైతులు సదరు పరిశ్రమకే బానిసలుగా మారేలా ఉండకూడదు. రైతుల చేతుల్లోనే ఆ పరిశ్రమల జుట్టు ఉండాలి. జీరో పొల్యూషన్ పరిశ్రమలైతేనే ప్రస్తుతం మనుగడ సాగించే అవకాశాలు ఉన్నాయి. – ప్రొఫెసర్ దొంతి నర్సింహారెడ్డి, పబ్లిక్ పాలసీ ఎక్స్‌పర్ట్




కల్యాణం.. కమనీయం..

నిర్మల్ దత్తాత్రేయనగర్ కాలనీలో శ్రీదత్తాత్రేయ, శివపంచాయతన యంత్రోద్ధారక ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గణాధిపతి పూజ, వాస్తు ఆరాధన, అఖండ దీప స్థాపనతోపాటు ధ్వజారోహణ, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – నిర్మల్‌ఖిల్లా

నిఘా నీడన ఇంటర్ మూల్యాంకనం

- ఈనెల 10న ప్రారంభమైన ప్రక్రియ
- 22 నుంచి మొదటి స్పెల్ ప్రారంభం
- ఏప్రిల్ 10 వరకు పూర్తయ్యేలా ప్రణాళిక



లక్ష్మణచాంద: ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం వడివడిగా సాగుతోంది. ఈనెల 10న జిల్లా ఇంటర్ అధికారులు మూల్యాంకనం ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో మొత్తం నాలుగు విడతల్లో నిర్వహిస్తున్నారు. ఈ నెల 10న ప్రారంభమైన ప్రక్రియలో భాగంగా మొదట సంస్కృతం పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియకు మొత్తం 04 ఏఈలుగా నియమించారు. ఈనెల 22వ తేదీ నుంచి మొదటి విడత ప్రారంభమైంది. ఇందులో తెలుగు, ఆంగ్లం, గణితం, పొలిటికల్ సైన్స్ పేపర్లు మూల్యాంకనం చేయడానికి ఎగ్జామినర్లు ఈనెల 21వ తేదీన రిపోర్ట్ చేశారు. రెండో విడత మూల్యాంకనం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్లు మూల్యాంకనం చేయడానికి ఎగ్జామినర్లు ఈనెల 23న రిపోర్ట్ చేశారు. ఇక మూడో విడత మూల్యాంకనం ప్రక్రియ ఈనెల 26న ప్రారంభం కానుంది. ఇందులో రసాయనశాస్త్రం, కామర్స్ పేపర్లు మూల్యాంకనం చేయడానికి ఎగ్జామినర్లు ఈనెల 25న రిపోర్ట్ చేయనున్నారు. నాలుగో విడత మూల్యాంకనం ఈనెల 28న ప్రారంభమవుతుంది. ఇందులో వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, చరిత్రకు సంబంధించిన ఎగ్జామినర్లు ఈనెల 27న రిపోర్ట్ చేయనున్నారు.

సీసీ కెమెరాల మధ్యన మూల్యాంకనం...

గతంకు భిన్నంగా ఈసారి ఇంటర్ బోర్డు మొదటి నుంచి అన్నింటిని ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మొదట ఇంటర్ రెండవ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలను సీసీ కెమెరాలు మధ్యన నిర్వహించిన ఇంటర్ బోర్డు అధికారులు అనంతరం ఇంటర్ వార్షిక పరీక్షలు కూడా సీసీ కెమెరాల మధ్యన విజయవంతంగా నిర్వహించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు నేటితో ముగియడంతో ఇంటర్ మూల్యాంకనం కూడా సీసీ కెమెరాలు మధ్యన నిర్వహిస్తున్నారు. ఎగ్జామినర్లు మూల్యాంకనం కేంద్రానికి వచ్చి పేపర్లు తీసుకున్నది మొదలు మూల్యాంకనం పూర్తి చేసి తిరిగి చీఫ్ ఎగ్జామినర్లకు(సీఈలకు) పేపర్లు అందజేసే వరకు మొత్తం సీసీ కెమెరాలు పర్యవేక్షణలో జరుగుతుంది.

బయోమెట్రిక్ హాజరు..

ఇంటర్ మూల్యాంకనానికి హాజరయ్యే ఎగ్జామినర్లకు ఈసారి బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెట్టారు. మూల్యాంకనానికి వచ్చే అధ్యాపకులు రోజు ఉదయం 10:30 గంటల లోపే బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.10:30 తర్వాత వచ్చే ఎగ్జామినర్లకు ఈసారి అనుమతి ఉండదని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

రోజుకు 30 పేపర్లు...

జిల్లాకు మొత్తం 1,37,000 జవాబు పత్రాలు వచ్చాయని ఇంటర్ నోడల్ అధికారి పరశురామ్‌నాయక్ తెలిపారు. జిల్లాలోని మూల్యాంకనానికి 500 మంది ఏఈలు పాల్గొంటారని పేర్కొన్నారు. మూల్యాంకనానికి హాజరవుతున్న ఎగ్జామినర్లకు ఒక రోజుకు 30 పేపర్ల చొప్పున ఇస్తారు. ఇందులో ఉదయం 15 పేపర్లు మధ్యాహ్నం 15 పేపర్ల చొప్పున ఇస్తారు.

'ఇథనాల్' ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

- అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లాలో జరిగిన ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్యమంలో రైతులు, మహిళలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ జీరో అవర్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో గ్రామంలో ప్రజలకు, పంటలకు ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారని తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి ఫ్యాక్టరీని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఉద్యమంలో పాల్గొన్న రైతులు, మహిళలపై పెట్టిన కేసులు అలాగే ఉన్నాయని తెలిపారు. కేసులు ఎత్తివేయాలని కోరారు.

గోడు వినండి.. గోస తీర్చండి

- ప్రజావాణిలో కలెక్టర్‌ను అర్జీదారుల వేడుకోలు
- తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశం
- గ్రీవెన్స్‌కు 8 ఫోన్ కాల్స్, 76 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి బాధితులు బారులు తీరారు. వివిధ సమస్యలతో వచ్చిన పలువురు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు అర్జీలు సమర్పించి తమ గోడు వెల్లబోసుకున్నారు. గోస తీర్చాలని వేడుకున్నారు. అర్జీదారుల సమస్యలు ఓపికగా విన్న కలెక్టర్ బాధితుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూం తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా అధికారులందరూ సమయానికి ప్రజావాణికి హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణి రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలను సందర్శిస్తూ, నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెలి ప్రజావాణికి 8 ఫోన్‌కాల్స్..

వేసవి నేపథ్యంలో దూర ప్రాంత ప్రజల సౌకర్యార్థం సోమవారం నుంచి టెలి ప్రజావాణి ప్రారంభించారు. ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజల ఫోన్‌కాల్ స్వీకరించి మాట్లాడారు. వాటిని నమోదు చేసుకొని సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 8 మంది, నేరుగా 76 మంది దరఖాస్తుదారులు వివిధ ప్రాంతాల నుంచి తమ అర్జీలను సమర్పించారు. ఫోన్ ద్వారా వచ్చిన దరఖాస్తు వివరాలను వాట్సాప్ ద్వారా స్వీకరించి ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధించి రశీదును వాట్సాప్ ద్వారా అందించారు.



టెలీ ప్రజావాణిలో కాలర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

న్యాయం జరగడం లేదు..

నేను జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాను. ఒక ఫైనాన్స్ కంపెనీలో నా భర్త నాకు తెలియకుండా రూ.2 లక్షల రుణం పొందాడు. సదరు ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు పదేపదే వస్తున్నారు. ఈ విషయం చెబితే నా భర్త నన్ను కొట్టి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. జాడ దొరకడం లేదు. ఆచూకీ తెలియడం లేదు. ఈ విషయమై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ ఇచ్చాను. భరోసా, సఖీ కేంద్రానికి వెళ్లాను. ఎలాగైనా సమస్య పరిష్కరించండి. – శృతి, భాగ్యనగర్, నిర్మల్

వేధింపులు ఆపాలి..




ఖానాపూర్ మండలం పాత తర్లపాడ్ గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు 1991లో సర్వే నంబర్ 113లో ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున భూమి కేటాయిస్తూ పట్టాలు మంజూరు చేశారు. 34 ఏళ్లుగా ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. భూమి అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. బ్లేడ్ ట్రాక్టర్, జేసీబీ లాంటివి ఉపయోగిస్తే సీజ్ చేస్తామని వేధిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు ఆంక్షలు, విధించడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. – పాత తర్లపాడ్, ఖానాపూర్

విధుల్లోకి తీసుకోవాలి..



నేను 15 ఏళ్లు దిలావర్‌పూర్ మండలం కంజర గ్రామపంచాయతీలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించాను. పక్షవాతం వచ్చినందున కొన్ని రోజులు విధులకు దూరంగా ఉన్నాను. ఇదే విషయం సంబంధిత తహసీల్దార్‌కు తెలిపి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని అడిగాను. నాకు అధికారికంగా ఉత్తర్వులు ఉంటేనే తీసుకుంటానని చెప్పారు. తిరిగి విధుల్లోకి తీసుకోండి. – నీరటి లింగన్న, కంజర

భూమి మంజూరు చేయాలి..



నేను ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాను. 2030లో రిటైర్ అవుతాను. మా మండలంలో నాకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఐదు ఎకరాల భూమి కోసం ఇప్పటికీ 20 సార్లు తహసీల్దార్‌కు వినతులు సమర్పించాను. మండలంలో 50 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. కానీ తహసీల్దార్ ప్రభుత్వ భూమి లేదని, కేటాయించడం కుదరదని చెబుతున్నాడు. దేశ సేవ చేసే నాకు న్యాయం చేయండి. – అలిశెట్టి రాకేశ్, సుర్జాపూర్

ఎల్లమ్మ చెరువుకు మరమ్మతులు చేయించాలి..

కుభీర్‌కు చెందిన సభ్యులం. ఎల్లమ్మ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. చెరువులో 2023 జూలై మొదటి వారంలో రెండు లక్షల విలువచేసే చేప పిల్లలు వదిలాము. జూలై 27న భారీ వర్షాలకు చెరువు తెగి పోవడంతో అన్నీ కొట్టుకుపోయాయి. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుంది. అధికారులు చొరవ తీసుకుని చెరువుకు మరమ్మతులు చేయించి మాకు పరిహారం ఇప్పించాలి. – కుభీర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు



కల్వర్టు పునర్నిర్మించాలి..

నాకు కడెం మండలం కొండుకూర శివారులో భూములు ఉన్నాయి. ఈ భూమిలోకి వెళ్లే దారిలో నీటిపారుదల శాఖ కాలువ ఉంది. ఈ కాలువపై ఉన్న కల్వర్టును ముక్కెర శ్రీను, ఆకుల పుల్లయ్య, ఆకుల శ్రీను కల్వర్టుని తొలగించి మార్గం లేకుండా చేశారు. కాలువ నీటిని అక్రమంగా వాడుకుంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే ఇరిగేషన్ ఏఈ, ఈఈలతోపాటు స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోవడం లేదు. కాలువపై కల్వర్టును పునర్నిర్మించాలి. – క్లోం నారాయణరెడ్డి, కొండుకూర్



క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి


ప్రమోద్ మృతదేహం

బాసర: బాసర ఆలయానికి వెళ్లే మూల మలుపు రెండో ఆర్చి గేట్ వద్ద సోమవారం ప్రమాదం జరిగింది. సరస్వతీ ఆలయం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో బాసర విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ ప్రమోద్ డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై గణేశ్ పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ – దిలావార్‌పూర్ మార్గంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఖానాపూర్ పట్టణానికి చెందిన మజహర్ సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనంపై వెళ్తుండగా మేకల సుధీర్ అతడిని ఆపి తనిఖీ చేసి ఫొటోలు తీశారన్నారు. దీంతో మజహర్ పోలీసులు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు


దుప్పిని కాపాడిన యువకులు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ పరిసరాల్లోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు సోమవారం దాడి చేశాయి. జనావాసాల్లోకి వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడించాయి. స్థానిక యువకులు గమనించి కాపాడాచి కాపాడారు. యువకులు స్వాములు రాకేశ్, విష్ణు, ప్రశాంత్, అంజి దానిని అటవీ సిబ్బందికి అప్పగించారు.

సులభంగా కొత్త విద్యుత్ కనెక్షన్లు

నిర్మల్‌చైన్‌గేట్:వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ కనెక్షన్లను సులభంగా మంజూరు చేస్తున్నామని విద్యుత్ శాఖ నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.సుదర్శనం తెలిపారు. వినియోగదారునికి కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణంతో దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారుడు తగు విధంగా స్పందించడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివిధ కారణాలతో డిపార్ట్‌మెంట్ రూల్‌కు లోబడి కొత్త సర్వీసులు ఆలస్యం కాకుండా దరఖాస్తుదారుడికి మెసేజ్ రూపకంగా ప్రతి దశలో వెళ్తుందన్నారు. అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి కొత్తగా ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించామని తెలిపారు. అప్లికేషన్ నంబర్‌తో టీజీ ఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి లేదా టీజీ ఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా వివిధ దశల్లో ఉన్న అప్లికేషన్ స్థితిని తెలుసుకోచ్చని వివరించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు


ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నామని, జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రారంభించారు. అనంతరం క్షయ నివారణకు ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు ముందుకు రావాలని, నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా ప్రోగ్రాం అధికారి సురేందర్, డీపీఎం ప్రశాంతి, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పద్మ, డెమో బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టాళ్ల నిర్మాణం... బల్దియాకు ఆదాయం

- ప్రభుత్వ, సింగరేణి ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారాలు
- స్టాళ్లు నిర్మించి అద్దెకు ఇస్తే మున్సిపాలిటీకి వనరులు


చాడేశ్వరి ముందు రోడ్డుపక్కన ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ, సింగరేణి ఖాళీ స్థలాలకు కొదువలేదు. అంతర్గత ప్రధాన రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. నిరుపేదలు, నిరుద్యోగులు, సింగరేణి రిటైర్డు కార్మికులు తోపుడు బండ్లపై, తాత్కాలికంగా చిన్నపాటి షెడ్లను ఏర్పాటు చేసుకుని పండ్లు, కూరగాయలు, మటన్, చికెన్, ఇతర రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. చిరు వ్యాపారం పేద కుటుంబాలకు జీవనాధారంగా మారగా శాశ్వత ప్రాతిపదికన నిర్వహించే అవకాశాలు లేకుండా ఉన్నాయి. మున్సిపాలిటీ పరంగా స్టాళ్లను నిర్మించి చిరు వ్యాపారులకు కేటాయిస్తే జీవనోపాధి కల్పించడంతో పాటు బల్దియాకు ఆదాయ వనరులు సమకూరే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఆదిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా చేస్తే ఉపయోగం

మున్సిపాలిటీలోని స్టేషన్ రోడ్‌కాలనీ (చర్చీస్ క్వార్టర్స్) అంతర్గత ప్రధాన రహదారి పక్కన చాడేశ్వరి ముందు, కోర్టు ఎదుట ఉన్న ఖాళీ స్థలాల్లో ప్రస్తుతం తోపుడు బండ్లు, షెడ్ల ఆధారంగా ప్రజావసరాలకు అనుగుణంగా మటన్, చికెన్, కట్టెలు, పండ్లు ఇతర రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మున్సిపాలిటీ పరంగా స్టాళ్లను నిర్మించడం వల్ల చిరు వ్యాపారులకు లబ్ధిచేకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

- ఏరియాలకు అనుగుణంగా అందుబాటులో స్టాళ్లను నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల వాసులకు నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి సౌలభ్యంగా ఉంటుంది. బజారు ఏరియా ప్రాంతానికి రావడానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం కలిసి వస్తుంది. కాలినడకన వెళ్లి సునాయాసంగా కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుంది.
- మున్సిపాలిటీలో నివసిస్తున్న యువతకు స్వయం ఉపాధి లభించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు నివారించడానికి అవకాశాలు ఉంటాయి.
- రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల్లో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఉండడంతో పాటు పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుంది.
- స్టాళ్ల ఏర్పాటు వల్ల మున్సిపాలిటీకి స్థిరమైన ఆదాయం వస్తుంది. తద్వారా సిబ్బందికి వేతనాలు చెల్లించడానికి ఆర్థికభారం నుంచి కాస్త ఉపశమనం కలుగుతుంది.
- స్టాళ్లను నిర్మించడం వల్ల సాధ్యమైనంత వరకు ఖాళీ స్థలాలు దురాక్రమణకు గురి కాకుండా ఉంటాయి. ప్రజావసరాలకు దోహద పడతాయి.

రెండు చోట్ల స్టాళ్ల నిర్మాణం

మున్సిపాలిటీ తరఫున ఇప్పటికే మూసివేతకు గురైన సింగరేణి వర్క్‌షాప్, స్టోర్స్ ముందు ప్రధాన రహదారి పక్కన, కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద స్టాల్‌ల నిర్మాణం జరిగింది. వాటిని చిరు వ్యాపారులు అద్దెకు తీసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రెండువైపులా స్టాళ్లు ఉండగా ఒకవైపు ఉన్న వాటిని మాత్రమే అద్దెకు తీసుకున్నారు. రామకృష్ణ థియేటర్ పక్కన నిర్మించిన స్టాళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కాగా స్టాళ్లలో కాకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద కొంతమంది కూరగాయలు అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం. స్టాళ్ల ద్వారా మున్సిపాలిటీకి స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నా సరిగా శ్రద్ధపెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సముచిత నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్వర్ణకారులకు గడ్డు కాలం

- ఆర్నెళ్లుగా పసిడి ధరలు పైపైకి
- నగల తయారీపై ప్రభావం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


పనులు లేక ఖాళీగా కూర్చున్న స్వర్ణకారులు

పాతమంచిర్యాల: పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతున్నాయి. ఆర్నెల్లుగా బంగారం ధరలు పెరుగుతుండడంతో ఆ ప్రభావం నగల తయారీపై పడుతోంది. దీంతో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న స్వర్ణకారులు, బంగారు ఆభరణాల తయారీదారులు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. బంగారం ధర నిలకడగా ఉండకపోవడంతో కొనుగోలు దారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో చిన్నచిన్న ఆభరణాలు తయారు చేసేవారికి పని లేకుండా పోతోంది. పెరుగుతున్న బంగారం ధర ఒక కారణమైతే కార్పొరేట్ సంస్థలు తయారు చేసే ఆభరణాలు కొనుగోళ్లు కాగా బెంగాల్ నుంచి వచ్చిన కొందరు నగల తయారీదారులు తక్కువ రేట్ల కే నగలు తయారు చేయడం మరో కారణంగా స్వర్ణకారులు పేర్కొంటున్నారు. కాగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న స్వర్ణకారులకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

పెరుగుతున్న బంగారం ధరలు

గతేడాది నవంబర్‌లో బంగారం 10 గ్రాములకు రూ.78 నుంచి రూ.79 వేలకు మధ్యలో ఉంది. డిసెంబర్ నుంచి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం రూ.90,900 ధర పలుకుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో కూడా నగల తయారీ కోసం అంతగా ఆర్డర్లు రాలేదని, తాళిబొట్లు, పుస్తెమెట్టెల తయారీకి కూడా ఆర్డర్లు దొరకడంలేదని వాపోతున్నారు. వాటి తయారీకి కూడా ఆర్డర్లు రావడంలేదని, అవి కొనుగోలు చేసేందుకు పెద్ద పెద్ద దుకాణాలకే వెళ్తున్నారని స్వర్ణకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను బీసీ కార్పొరేషన్‌లో కాకుండా స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు అందిస్తే కొంత చేయూత అందించినట్లవుతుందని స్వర్ణకార సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

స్వర్ణకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు అందించాలి. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి బంగారు నగల తయారీ చేస్తూ మాకు పనులు లేకుండా చేస్తున్న వారిని కట్టడి చేయాలి.

– ధర్మవరం బ్రహ్మయ్య, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల

ధరల పెరుగుదల నియంత్రించాలి



బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతుండంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. పెళ్లిళ్లు, శుభకార్యాలకు బంగారం కొనాలంటే ప్రజలు ఆలోచన చేస్తున్నారు. నగలు తయారు చేయించుకునేందుకు మొగ్గు చూపడంలేదు. బంగారం ధరలు తగ్గితే సామాన్యులకు కొంత ఊరట కలుగుతుంది.

– ఎర్రోజు వేణుగోపాలాచారి, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పనుల్లేక ఖాళీగా ఉంటున్నాం



పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే ఆభరణాల తయారీలో బిజీగా ఉండే వాళ్లం. కానీ ప్రస్తుతం పనులు లేక ఖాళీగా ఉంటున్నాం. ధరలు పెరగడంతో బంగారం కొనుగోళ్లు తక్కువయ్యాయి. దీంతో పనులు లేక షాపులకు అద్దె చెల్లించలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఆదుకుంటేనే స్వర్ణకార వృత్తిదారులకు మనుగడ.

– రమేశ్, స్వర్ణకారుల సంఘం జిల్లా నాయకులు, మంచిర్యాల

గంజాయి అమ్ముతున్న యువకుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. సోమవారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం... కన్నాల బస్తీ వద్ద కొందరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, పోలీసు సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల్లో ఎండీ.తాజ్‌బాబా(హన్మాన్ బస్తీ–బెల్లంపల్లి), షేక్ ఇర్ఫాన్ బాబా (షంషీర్ నగర్–బెల్లంపల్లి), వాసాల గిల్‌క్రిస్ట్(రాజీవ్‌నగర్–తాండూర్), మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి వలస వచ్చిన సంతోష్ సామ్రాడ్ జాదవ్ (కాల్‌టెక్స్ ఏరియా) ఉన్నారు. వీరి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా గంజాయి, తాగుడుకు బానిసగా మారి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

రూ.26.25లక్షలు పలికిన తైబజార్


వేలం నిర్వహిస్తున్న కమిషనర్ రాజు

కైలాస్‌నగర్: పట్టణ తైబజార్ వేలం ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరింది. పట్టణానికి చెందిన మీర్జా అఫ్రీన్‌బేగ్, సయ్యద్ ఇస్రార్, కాళ్ల సాయికృష్ణలు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ సీవీఎన్.రాజు అధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఇస్రార్ గైర్హాజరు కాగా మిగతా ఇద్దరు హాజరయ్యారు. ఇందులో అధికంగా రూ.26.25 లక్షలకు మీర్జా అఫ్రీన్‌బేగ్ తైబజార్‌ను దక్కించుకున్నారు. గతేడాది రూ.20.69 లక్షలకు వేలం వేయగా, ఈసారి బల్దియాకు రూ.5.56లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. సదరు వ్యక్తికి ఏడాదిపాటు తైబజార్ నిర్వహించుకునే అవకాశముంటుంది. బల్దియా ఉద్యోగులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఎంపికపై ఫిర్యాదు

- ఒకే కేంద్రంలో 61 మంది ఎంపికపై విచారణకు తల్లిదండ్రుల వినతి


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: భైంసా పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కేంద్రంలో 61 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంపై విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లి దండ్రులు, నాయకులు కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సోమవారం ఫిర్యాదు చేశారు. గతేడాది నవంబర్ 24న జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష జరిగిందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన ప్రొవిజినల్ లిస్టులో అధికారులు 68 మంది పేర్లు ప్రకటించగా, అందులో భైంసా కేంద్రానికి చెందిన వారే 61 మంది ఎంపిక కావడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విచారణ చేసి మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో పుప్పాల గజేందర్, విద్యార్థుల తల్లి దండ్రులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



ఫ్లెక్సీలు విడుదల చేస్తున్న ఎస్పీ, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డితో సోమవారం ట్రాఫిక్ అవగాహనతో కూడిన ఫ్లెక్సీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. పట్టణంలో సీసీ కెమెరాల ద్వారా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు పోతారం శ్రీనివాస్, సీహెచ్.నాగేందర్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో భార్యాభర్తలకు జైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ దుకాణంలో దొంగతనానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలు శిక్ష పడింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పోస్టాఫీసు బస్తీకి చెందిన అజయ్‌కుమార్ సహానికి బజారు ఏరియా ప్రాంతంలో బట్టల దుకాణం ఉంది. 2022 నవంబర్ 6న రాత్రి దుకాణంలో చోరీ జరిగింది. 250 గ్రాముల బంగారు బిస్కెట్లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.5000 నగదు దొంగిలించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్‌వో ఎం.రాజు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. బెల్లంపల్లి హన్మాన్‌బస్తీకి చెందిన భార్యాభర్తలు ఎండీ.బద్రుద్దీన్, ఆస్పియా సీరిన్‌పై కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ చేసి చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.అజయ్‌కుమార్ ప్రవేశపెట్టగా జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జే.ముకేష్ విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఆరు నెలల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

దాడికేసులో ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: దాడి కేసులో ముగ్గురిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురు కార్మికులపై ఈనెల 9న కొందరు దాడిచేశారు. కార్మికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి భగత్‌సింగ్ కాలనీకి చెందిన అద్నూరి రాజు, సమీర్, అర్బాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ


హనుమాన్ ఆలయంలో పగులగొట్టి ఉన్న తాళం

బోథ్: మండలంలోని పెద్దార్లగుట్టలో హనుమాన్ ఆలయం, వాగు వద్ద గల అయ్యప్ప సన్నిధానంలో చోరీ జరిగింది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం స్థానికుడు.. అయ్యప్ప సన్నిధానానికి వెళ్లగా తలుపుల తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా ఉంది. అలాగే హనుమాన్ ఆలయం తాళం పగులగొట్టి ఉండడాన్ని భక్తుడు గమనించాడు. హుండీని పగులగొట్టి ఉండడంతో స్థానికులకు సమాచారం అందించాడు. అందులో నగదు ఎత్తుకెళ్లారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని పట్నాపూర్‌కు చెందిన మడావి కార్తీక్ చోరీ చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఐదు గంటల్లోనే దొంగను పట్టుకున్న ఎస్సై, పోలీసు సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ద్వారకానగర్‌లో ఆదివారం రాత్రి బైక్ చోరీకి గురైంది. నేరడిగొండ మండలంలోని వాగ్దారికి చెందిన సోయం వెంకటేశ్ ఆదిలాబాద్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేసిన ఆయన ఉదయం చూసేసరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కలా గాలించినా కనిపించలేదు. సోమవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు విరాళం


విరాళం ప్రకటిస్తున్న ముఖరా కే గ్రామస్తులు

ఇచ్చోడ: వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవ సభకు ముఖరా కే గ్రామస్తులు సోమవారం రూ.1,02,003 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేశారని తెలిపారు. అందుకని 25ఏళ్ల పార్టీ ఆవిర్భవ సభకు గ్రామస్తులంతా కలిసి ఖర్చుల కోసం విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విరాళం చెక్కును అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు మానుకోవాలి

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్(చెన్నూర్): అధికారులు కార్మికులపై వేధింపులు మానుకోవాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిని సెంట్రల్ కమిటీ సభ్యులు తిప్పారపు సారయ్యతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బెదిరింపు లెటర్లు, చార్జీషీట్లు ఇస్తూ కొంతమంది అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, వేతనంలో కోత విధిస్తున్నారని, సమస్యల మీద ప్రశ్నించిన వారిని టార్గెట్ చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్మికులు తెలపగా అధికారులపై మండిపడ్డారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారించడంతో పాటు రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు అశోక్, కొమురయ్య, సాయికుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ‘త్రినయన’


విద్యార్థులతో ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ట్రిపుల్ ఐటీలో త్రినయన సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో జానపదాల పాటలు, నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళలు, సంగీతం, నృత్యం మాత్రమే కాకుండా, ఫ్యాషన్ ప్రదర్శన ‘ఫ్యాషన్ ఫ్రెంజీ’ ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ‘త్రినయన’ పేరిట జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు తమలోని కళా నైపుణ్యం ప్రదర్శించారన్నారు. ఈ ఉత్సవం విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏఓ రణధీర్‌సాగి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కన్వీనర్లు డాక్టర్ రాములు, డాక్టర్ అజయ్, ప్రభాకర్‌రావు అసోసియేటెడ్, డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు

వైద్య విద్యార్థుల జోష్


మెమెంటోలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సులేమాన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఫెస్ట్ 2.0లో వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరిస్తున్నాయి. వైద్య విద్యలో నిత్యం బిజీగా ఉండే విద్యార్థులు ఈ నెల 27నుంచి కళాశాలలో క్రీడలు నిర్వహించగా, 21నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఫెస్ట్‌లో ప్రదర్శించి ఆకట్టుకుంటున్నారు. 300మంది ఎంబీబీఎస్ విద్యార్థులు వారం రోజులపాటు నిర్వహించే ఫెస్ట్‌కు కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.సులేమాన్, ప్రొఫెసర్లు ప్రోత్సహిస్తూ, వారికి మెమెంటోలు అందజేస్తున్నారు.

మహారాష్ట్ర వ్యక్తి మంచిర్యాలలో అరెస్ట్

మంచిర్యాలక్రైం: మహారాష్ట్ర పోలీసులు మంచిర్యాలలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన కలకలం రేపింది. అరెస్ట్ అయింది ఎవరు..? ఎందుకు అరెస్ట్ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా.. మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని కోలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లింది వాస్తవమేనని పేర్కొన్నారు. మహారాష్ట్ర పోలీసులను సంప్రదించగా.. మహారాష్ట్రలోని కోలాపూర్ ప్రాంతానికి చెందిన ప్రసాద్ పురస్కార్(ఓ నేషనల్ చానల్ రిపోర్టర్) ఛత్రపతి శివాజీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో అల్లర్లు చెలరేగాయని తెలిపారు. ఈ మేరకు ప్రసాద్‌పై కోలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. ప్రసాద్ కోసం గాలిస్తుండగా తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల లోతలదాచుకున్నాడని సాంకేతికత ఆధారంగా గుర్తించి సోమవారం అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు తెలిపారు.